గాలి అనిల్‌కుమార్‌కు టికెట్ రాపోవడంతో ఆదివారం గాంధీభవన్ వద్ద నిరసన తెలుపుతున్న నర్సాపూర్ కార్యకర్తలు

తమ నాయకుడికి టికెట్ కేటాయించనందుకు గాంధీ భవన్ ప్రాంగణంలో పెట్రోల్ పోసుకుంటున్న కార్యకర్త

లొల్లి ముదిరింది..యాత్ర ఆగింది

I తరువాయి...

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ బస్సుయాత్ర జరుగాల్సి ఉన్నది. దీనికి రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, ఖర్గే లాంటి నేతలు వస్తారని ప్రచారం చేశారు. కానీ టికెట్లు అమ్ముకున్నారంటూ సొంత పార్టీ నేతలే రోడ్లెక్కడ్డం, ధర్నాలు చేస్తామని బెదిరించడం వంటి పరిణామాలు అగ్ర నేతల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. బస్సు యాత్రకు ముగ్గురు నేతల్లో ఎవరు హాజరవుతారనే అంశంపై ఆదివారం సాయంత్రం వరకు ఢిల్లీ నుంచి స్పష్టత రాలేదని, రాష్ట్ర నేతలు ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం ఇవ్వలేదని సమాచారం. ఇప్పటికే తాను నిర్వహించిన సభలతో ఎలాంటి ఫలితం లేదని, ఇకపై వచ్చినా ఒరిగేదేమీ లేదని రాహుల్‌గాంధీకి అర్థమైందని, తాను వచ్చినా వ్యర్థమని ప్రియాంక గుర్తించారని, రాష్ట్రంలో పార్టీ పరువు పాతాళంలో ఉన్నదని ఖర్గేకు ఆది వారం నర్సాపూర్‌లో నిర్వహించిన సభతో అవగతం అయ్యిందని పార్టీ అసంతృప్త నేతలు చెప్పుకుంటున్నారు. అంతర్గత కుమ్ములాటలు, టికెట్ల అమ్మకాల నిరసనలకు భయపడి పీసీసీ అధ్యక్షుడు, స్థానిక నేతలు కూడా ప్రచారం చేసుకునే పరిస్థితి లేదని వ్యాఖ్యానిస్తున్నారు. ఇవన్నీ చెప్పుకోలేక 'అనివార్య కారణాల వల్ల బస్సుయాత్రను రద్దు చేస్తున్నాం' అని ప్రకటించుకున్నారని ఎద్దేవా చేస్తున్నారు.

అన్ని నియోజకవర్గాల్లో ఆగమాగం

రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో చూసినా కాంగ్రెస్ ఆగమాగం అవుతున్నది. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ టికెట్‌ను కంది శ్రీనివాస్‌రెడ్డికి కేటాయించడంతో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ రాజీనామా చేశారు. దేవరకద్రలో జీ మధుసూదన్‌రెడ్డిని మార్చాలంటూ మండలాల్లో కాంగ్రెస్ నాయకులు ర్యాలీలు నిర్వహించారు. యాదాద్రి భువనగిరిలో కల్లూరి రామచంద్రారెడ్డి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. కూకట్‌పల్లి టికెట్ ఆశించిన గొట్టిముక్కల వెంగళరావు కాంగ్రెస్‌ను వీడుతున్నట్టు ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన బీఆర్ఎస్‌లో చేరతానని ప్రకటించారు. జూబ్లీహిల్స్ టికెట్ దక్కని పీజేఆర్ తనయుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆదివారం రాత్రి కలవడం ప్రాధాన్యం సంతరించుకున్నది. మహేశ్వరం టికెట్ ఆశించిన పారిజాత నర్సింహారెడ్డితో పాటు మరో ముగ్గురు నేతలు కూడా స్థానికేతరుడైన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి మద్దతు ఇచ్చేది లేదని బాలాపూర్‌లో జరిగిన ముఖ్య సమావేశంలోనే పార్టీకి ఆల్టీమేటం జారీ చేశారు.

గాంధీభవన్ వద్ద రేవంత్‌పై మండిపడుతున్న నర్సాపూర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కోవర్ట్ కో హఠావో.. కాంగ్రెస్ కో బచావో

గాంధీభవన్ వద్ద నర్సాపూర్ నియోజకవర్గ అసంతృప్త నేతలు వీరంగం సృష్టించారు. గాలి అనిల్‌కుమార్‌కు టికెట్ ఇవ్వాలంటూ ఆయన అనుచరులు గాంధీభవన్ బయట నిరసన తెలిపారు. బీసీ బిడ్డకు అన్యాయం చేశారని, వెంటనే రాజిరెడ్డికి టిక్కెట్ రద్దు చేసి అనిల్‌కుమార్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. 'కోవర్ట్ కో హఠావో.. కాంగ్రెస్ కో బచావో' అంటూ నినాదాలు చేశారు. 'నర్సాపూర్‌లో కోవర్ట్‌కు టికెట్ ఇచ్చారు. దొంగ సర్వేలు చేసి, నర్సాపూర్ టికెట్ రూ.100 కోట్లకు అమ్మేశారని కొన్నాళ్లుగా ప్రచారంలో ఉన్నది. ఇప్పుడు దానిని మేం వందశాతం నమ్ముతున్నాం' అని ఒక కార్యకర్త మండిపడ్డారు. మరో కార్యకర్త ఏకంగా పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు. మరోవైపు గాంధీ భవన్‌లో సమావేశమైన ఎన్ఎస్‌యూఐ నేతలు టికెట్ల కేటాయింపులో తమకు మొండి చేయి చూపించారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు టికెట్ ఇవ్వలేదని, వనపర్తిలో శివసేనారెడ్డికి టికెట్ కేటాయిస్తారని భావించామని, కానీ మోసం చేశారని మండిపడ్డారు. అంబర్‌పేటలో శ్రీకాంత్‌కు టికెట్ ఇవ్వకపోవడంపై ఎన్ఎస్‌యూఐ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు ఫైజల్ ముజ్జు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మూడో తేదీ నాటికి శ్రీకాంత్‌కు టికెట్ ఇవ్వకపోతే మా గల్లీల్లోకి ఎవరు ప్రచారానికి వచ్చినా రాళ్లతో ఉరికించి కొడతాం. కష్టపడి పనిచేసేవాళ్లందరినీ హాలేగాళ్లను చేసిన్రు. రేవంత్‌రెడ్డి, వీహెచ్ ఇండ్లకు వెళ్లి మరీ కొడతాం' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

కొంప ముంచిన డీకే

కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కొంపముంచాడంటూ కాంగ్రెస్ నేతలు నెత్తినోరు బాదుకుంటున్నారు. ఇప్పటికే రేవంత్‌రెడ్డి వ్యవహారంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి ఘోరంగా తయారైందని, టికెట్లు అమ్ముకున్నాడన్న ఆరోపణలు, మూడు గంటల విద్యుత్తు చాలు వంటి వ్యాఖ్యలతో ప్రజల్లో ముఖం చూపించుకోలేకపోతున్నామని నేతలు వాపోతున్నారు. 'అతడి కంటే గొప్పోడు ఆచంట మల్లన్న' అన్నట్టుగా డీకే శివకుమార్ వచ్చి కర్ణాటకలో వ్యవసాయానికి 5 గంటల కరెంటే ఇస్తున్నామని చెప్పడంతో ఇజ్జత్ పోయిందని వాపోతున్నారు. వ్యవసాయానికి 24 గంటల కరంటు ఇస్తున్న రాష్ట్రానికి వచ్చి 5 గంటలు ఇవ్వడాన్ని గొప్పగా చెప్పుకోవడం కన్నా తెలివితక్కువతనం ఏమైనా ఉంటుందా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక మాడల్ అంతా వట్టి మోసమేనని బట్టబయలు చేశారని చెప్తున్నారు. డీకే వ్యాఖ్యలను కవర్ చేయలేక రాష్ట్ర కాంగ్రెస్ నేతలు తలపట్టుకుంటున్నారు. ఇప్పటికే రేవంత్ చేసిన 'వ్యవసాయానికి 3 గంటల కరంటు చాలు', ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడిన 'రైతుబంధు దుబారా' అన్న కామెంట్లతో ప్రజల్లో కాంగ్రెస్‌ను రైతు వ్యతిరేకిగా ముద్ర వేశాయని అంటున్నారు. ఇప్పుడు కర్ణాటకలో 5 గంటల కరెంటు మాత్రమే ఇస్తున్నామని డీకే చెప్పడం మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టు అయ్యిందని వాపోతున్నారు. ఏదో చేస్తాడని కర్ణాటక నుంచి నేతలను పట్టుకొచ్చి ప్రచారం చేస్తే.. బూమరాంగ్ అయ్యిందంటూ నెత్తిబాదుకుంటున్నారు. డీకే శివకుమార్‌ను రాష్ట్రమంతా తిప్పి ప్రచారం చేయించాలనుకున్న కాంగ్రెస్ ప్లాన్ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఈ పర్యటన ఇలాగే కొనసాగితే మరింత నష్టం ఖాయమని కాంగ్రెస్ అభ్యర్థులు గగ్గోలు పెడుతున్నారు. కనీసం తమకు డిపాజిట్లు దక్కాలంటే డీకే శివకుమార్‌ను ప్రచారానికి పంపొద్దని కోరుతున్నారు. ఈ మేరకు అధిష్ఠానానికి పలువురు నేతలు ఫిర్యాదు చేశారట. సోషల్ మీడియాలోనూ డీకే ప్రచారం వల్ల తమకు తీవ్ర నష్టం కలుగుతుందని, అక్కడ కూడా ఆయన ముఖం చూపెట్టొద్దని కోరుతున్నారట.

అవినీతి డీకే.. ఆదర్శ సూక్తులు!

- అక్రమ సంపాదనలో కింగ్ కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్
- ఆయనపై ఉన్న కేసులే ఉదాహరణ
- మనీలాండరింగ్ కేసులో అరెస్టు
- రూ.15కే టన్ను చొప్పున ఇనుప ఖనిజం కొనుగోలు
- ఆనక రూ.వేలకు టన్ను అమ్మకం
- ఇప్పటికీ సుప్రీంలో నడుస్తున్న కేసు
- అలాంటి వ్యక్తి వచ్చి ఇక్కడ నీతులు

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): దొడ్డలహళ్లి కెంపెగౌడ శివకుమార్.. ఈ పేరు ఎప్పుడైనా విన్నారా? ఈ పేరు చాలామందికి తెలియదు. కానీ.. డీకే శివకుమార్ అంటే మాత్రం చాలామంది కర్ణాటక డిప్యూటీ సీఎం అని టక్కున చెప్పేస్తారు. అవును.. డీకే శివకుమార్ పూర్తిపేరు అది. కర్ణాటకలో పేరుమోసిన కాంగ్రెస్ నేత అయిన డీకేఎస్.. ఇప్పుడు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో స్టార్ క్యాంపెయినర్‌గా ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అదిచేస్తాం.. ఇది చేస్తాం.. అని హామీలిస్తున్నారు. కానీ, కర్ణాటకలో గెలిపిస్తే ఏం చేశారో చాలామందికి తెలియదు కదా! కాంగ్రెస్-జేడీఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఈయనపై చాలా కేసులే ఉన్నాయి. మనీలాండరింగ్, అక్రమ మైనింగ్ కేసులు ఇప్పటికీ నడుస్తున్నాయి. పన్నుల ఎగవేత కేసులో ఈయన ఆస్తులపై 2017లోనే ఐటీ విభాగం సోదాలు నిర్వహించింది. లెక్కల్లో చూపని కట్టలకొద్దీ డబ్బును స్వాధీనం చేసుకోవటం అప్పట్లో సంచలనం సృష్టించింది. మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) 2019లో శివకుమార్‌ను అరెస్టు చేసింది. శివకుమార్ ప్రభుత్వం వద్ద అడ్డికి పావుశేరుకాడికి ఇనుపఖనిజం కొని భారీ లాభాలకు అమ్ముకొన్నారని సమాజ్ పరివర్తన్ సముదాయ (ఎస్‌పీఎస్) అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో కేసు (రిట్ పిటిషన్ నంబర్ 562 ఆఫ్ 2009) వేసింది. దాదాపు 9 లక్షల టన్నుల అత్యంత నాణ్యమైన ఇనుపఖనిజాన్ని నాణ్యత లేని ఖనిజంగా చూపుతూ ఈయన టన్నుకు రూ.15కే కొన్నాడని ఆరోపణ. సింగిల్ చాయ్ ధరకు టన్ను ఖనిజం కొని వేరే కంపెనీలకు వేల రూపాయలకు అమ్ముకొన్నారని సదరు సంస్థ ఆరోపించింది. డీకే శివకుమార్ అక్రమాస్తులు కలిగి ఉన్నారని సీబీఐ ఇప్పటికీ దర్యాప్తు జరుపుతున్నది. 2013-18 మధ్య ఆయన వద్ద లెక్కల్లో చూపని డబ్బు రూ.74.93 కోట్లు దొరికిందని సీబీఐ ఆరోపణ. ఇటీవల బెంగళూరులో రెండుచోట్ల ఐటీ అధికారులకు దొరిన రూ.70 కోట్లు కూడా శివకుమార్‌వేనని వార్తలు వచ్చాయి. ఆ డబ్బు శివకుమార్ అనుచరుల వద్దనే లభించటం గమనార్హం. ఆ సొమ్మును తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఖర్చు పెట్టేందుకే సిద్ధంచేశారని ఆరోపణలు వచ్చాయి. అంతేకాదు.. నాలుగు నెలల క్రితం కర్ణాటకలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో డీకే శివకుమార్‌కు డిప్యూటీ సీఎం హోదా లభించింది. ఆ వెంటనే ఆయనపై అవినీతి ఆరోపణలు గుప్పుమన్నాయి. కాంట్రాక్టర్ల నుంచి స్వయంగా శివకుమారే 50 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారని పలువురు కాంట్రాక్టర్లు ఆరోపించారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు తెలంగాణకు వచ్చి ఉద్ధరిస్తానని కబుర్లు చెప్తున్నారు. తెలంగాణ ప్రజలకు నీతులు చెప్తున్నారు.

వెంగళరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్, ఎమ్మెల్యేలు మాధవరం, అరికెపూడి గాంధీ

వెంగళరావుకు బీఆర్ఎస్ ఆహ్వానం

- సుముఖత వ్యక్తం చేసిన కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ నేత!

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 29 : కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో పార్టీకి రాజీనామా చేసిన గొట్టిముక్కల వెంగళరావును బీఆర్ఎస్ ఆహ్వానించింది. ఆదివారం వెంగళరావు నివాసానికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీ వెళ్లి పార్టీలోకి స్వాగతించారు. 40 ఏండ్లుగా కాంగ్రెస్‌లో ఉన్నా గుర్తింపు ఇవ్వలేదని వెంగళరావు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో చేరితే అన్ని రకాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. దీంతో ఆయన సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది.

ఎన్నికల్లో పోటీకి టీడీపీ నో

- అధిష్ఠానం నిర్ణయాన్ని తెలిపిన కాసాని

బంజారాహిల్స్, అక్టోబర్ 29: తెలంగాణలో పోటీ చేయకూడదని టీడీపీ నిర్ణయించింది. చంద్రబాబుతో మాట్లాడిన అనంతరం లోకేశ్ ఈ నిర్ణయాన్ని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు తెలియజేశారు. దీంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో టీటీడీపీ తరపున పోటీ చేయాలనుకున్న పలువురు నేతలు, వారి అనుచరులు బంజారాహిల్స్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. ఏడాది కాలంగా లక్షలు ఖర్చు చేస్తూ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తీరా ఎన్నికల సమయంలో తమను నట్టేట ముంచారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే లోకేశ్ వచ్చి తమకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడుతూ.. తెలంగాణలో పోటీ చేయాల్సిందేనని తాను పార్టీ అధిష్ఠానానికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా విముఖత చూపారని అన్నారు.

కాంగ్రెస్ విజయభేరి తుస్సు!

- సంగారెడ్డి కాంగ్రెస్ బహిరంగ సభలో ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు
- ఉద్ధండులు హాజరైనా ఉత్తదైన సభ
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ప్రసంగిస్తుండగా ఒక్కొక్కరుగా జారుకొన్న జనం
- ఆరు గ్యారెంటీలకు స్పందనే కరువు

సంగారెడ్డిలోని పాతబస్టాండు వద్ద ఉన్న గంజ్ మైదాన్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభలో ఖర్గే ప్రసంగం కొనసాగుతుండగానే వెళ్లిపోతున్న జనం

సంగారెడ్డి, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే జగ్గారెడ్డి సొంత ఇలాకా సంగారెడ్డిలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన విజయభేరి సభ అట్టర్‌ప్లాఫ్ అయ్యింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్యం ఠాక్రే సహా కాంగ్రెస్ ఉద్ధండులు హాజరైనప్పటికీ జనం లేక సభ తుస్సుమన్నది. సంగారెడ్డిలోని పాతబస్టాండ్ వద్ద ఉన్న గంజ్ మైదాన్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ నిర్వహించింది. సభకు ముఖ్య అతిథిగా మల్లికార్జున్ ఖర్గేతోపాటు రేవంత్‌రెడ్డి, మాణిక్యం ఠాక్రే, భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, వీ హన్మంతరావు, బోసురాజు హాజరయ్యారు. బహిరంగ సభలో దామోదర రాజనర్సింహ, భట్టి విక్రమార్క, రేవంత్‌రెడ్డి, జగ్గారెడ్డి ప్రసంగిస్తూ..కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల గురించి వివరించగా, జనం నుంచి స్పందన కనిపించలేదు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మినహా ప్రజలెవరూ చప్పట్లు కొట్టకపోవడంతో నాయకులందరూ తెల్ల ముఖాలు వేశారు. ఖర్గే ప్రసంగం ప్రారంభం కాగానే జనం ఒక్కొక్కరుగా సభాస్థలం నుంచి వెళ్లిపోవడం కనిపించింది. దీంతో బహిరంగసభలో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల గురించి ఖర్గే వివరించే ప్రయత్నం చేసినా ప్రజలు పట్టించుకోలేదు. తన ప్రసంగం కొనసాగుతుండగానే జనం వెళ్లిపోతుండటంతో ఖర్గే అసంతృప్తికి లోనయ్యారు. జగ్గారెడ్డి లేచి అందరూ కూర్చోవాలని కోరినా ఎవరూ వినలేదు. జనం సభ నుంచి వెళ్లిపోవటాన్ని చూసిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సైతం అసంతృప్తికి గురయ్యారు. ఎమ్మెల్యే జగ్గారెడ్డి అంతకుముందు ఏఐసీసీ చీఫ్ ఖర్గేకు స్వాగతం పలికేందుకు సంగారెడ్డి ప్రభుత్వ దవాఖాన ఎదుట వాహనంలో బైఠాయించారు. ఆయనతోపాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దవాఖాన ఎదుట గుమిగూడారు. దీంతో ప్రభుత్వ దవాఖానలోకి వెళ్లే వైద్యులు, రోగులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

ఆరెస్సెస్ ఏజెంట్లకు కాంగ్రెస్ టికెట్లు

- నా రాజీనామాకు రేవంత్‌రెడ్డే కారణం
- పీసీసీ మాజీ సభ్యుడు అబ్దుల్లా సోహైల్ షేక్ ఆరోపణ

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): బీజేపీ మూలాలు ఉన్నవారికి, ఆరెస్సెస్ ఏజెంట్లకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టికెట్లు కేటాయించారని పీసీసీ మాజీ సభ్యుడు, మైనార్టీ సెల్ చైర్మన్ అబ్దుల్లా సోహైల్ షేక్ ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ కేటాయించిన టికెట్లలో 25 టికెట్లు ఆరెస్సెస్ ఏజెంట్లకు, నోట్లకట్టలు గుమ్మరించినవారికే ఇచ్చారని విమర్శించారు. ఆదివారం ఆయన తన రాజీనామా లేఖను కాంగ్రెస్ హైకమాండ్‌కు పంపిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎప్పటినుంచో కాంగ్రెస్‌లో ఉన్న తమలాంటి వారిని దొంగ సర్వేల పేరుతో పక్కనపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 34 ఏండ్లుగా కాంగ్రెస్‌లో కొనసాగిన తాను ఎంతో బాధతో రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. తన రాజీనామాకు రేవంత్ కారణమని పేర్కొన్నారు. మైనార్టీ సెల్ చైర్మన్‌గా తాను బీజేపీకి సంబంధించిన వ్యక్తులకు ప్రచారం చేయబోనని స్పష్టం చేశారు.

ఎర్రబెల్లి బాహుబలి లెక్క

- అక్కడ దయాకర్‌రావును ఢీకొట్టడం చాలా కష్టం
- కాంగ్రెస్ అభ్యర్థి ఝాన్సీరెడ్డివి ఒంటెద్దు పోకడలు
- కాంగ్రెస్ నేత ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి మండిపాటు

దేవరుప్పుల, అక్టోబర్ 29: పాలకుర్తి నియోజకవర్గంలో బాహుబలి లాంటి బీఆర్ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు రంగంలో ఉన్నారని, ఆయనను ఢీకొనాలంటే చెమటోడ్చాలని పాలకుర్తి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఆశించిన ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. జనగామ జిల్లా దేవరుప్పులలో ఆదివారం ఝాన్సీ రెడ్డి పోకడలపై కాంగ్రెస్ అసమ్మతి నాయకుల సమావేశం జరిగింది. దీనికి నేతృత్వం వహించిన ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఝాన్సీరెడ్డి ఒంటెద్దు పోకడల వల్ల పార్టీకి ఇప్పటికే తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. బాహుబలి లాంటి, ఓటమి ఎరుగని నాయకుడు ఎర్రబెల్లిని ఢీకొట్టడం కనీస రాజకీయ అనుభవం లేని ఝాన్సీరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి వల్ల అవుతుందా? అని అన్నారు. ఝాన్సీరెడ్డి తీరుతో సీనియర్ కాంగ్రెస్ లీడర్లంతా పార్టీకి దూరంగా ఉంటున్నారని తెలిపారు. ఆమె కలుపుకుపోతే సరి, లేకపోతే తమ దారి తమదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వీరారెడ్డి దామోదర్‌రెడ్డి, పాలకుర్తి మాజీ ఎంపీపీ యాకస్వామి, అల్లం ప్రదీప్‌రెడ్డి, రవీందర్‌నాయక్, ప్యాక్స్ మాజీ చైర్మన్ భాస్కర్, రవి, నర్సింగరావు, జాటోత్ రాహుల్‌నాయక్, మహేందర్‌రెడ్డి, సలాం, రాహుల్‌రెడ్డి, కాసాని ఎర్రయ్య తదితరులు ఉన్నారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత శ్రవణ్ దాసోజు. చిత్రంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ వైర్మన్ కోలేటి దామోదర్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

రేటెంతరెడ్డి, డీకేకు గుణపాఠం చెప్పాలి

- 5 గంటల కరెంటు కావాలా?
- తెలంగాణ ఒకసారి ఆలోచించాలి
- అభివృద్ధి ఓర్వలేక తప్పుడు ప్రచారం
- బీఆర్ఎస్ నేత శ్రవణ్ దాసోజు

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): 24 గంటలు నాణ్యమైన ఉచిత కరెంట్ ఇస్తున్న కేసీఆర్ కావాలో? కేవలం 3 గంటలు, 5 గంటలు విద్యుత్తు ఇస్తామన్న రేటెంతరెడ్డి కాంగ్రెస్ కావాలో? కర్ణాటక కాంగ్రెస్ కావాలో? తెలంగాణ సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉన్నదని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ సూచించారు. రేటెంతరెడ్డికి, డీకే శివకుమార్ వంటి గజదొంగలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఉచిత కరెంట్ విషయంలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్వయంగా దొంగలా పట్టుబడ్డారని, తాము 5 గంటల కరెంటే ఇస్తున్నామని డీకే స్వయంగా చెప్పడం తెలంగాణ సమాజం ప్రత్యక్షంగా చూసిందని వెల్లడించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో శ్రవణ్ మాట్లాడుతూ.. తెలంగాణలో కొన ఊపిరితో ఉన్న కాంగ్రెస్.. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి నాయకులను రప్పించి అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. సీఎం కేసీఆర్‌ను కర్ణాటకకు రావాలని సవాల్ చేసిన డీకే శివకుమార్.. తెలంగాణలో ఏదైనా ఇంటిని సందర్శించి, ఏ ముసలవ్వనైనా పెన్షన్ ఎంత వస్తున్నదని అడిగితే ఆయనకు మూతిపగలగొట్టే సమాధానం ఇస్తారని చెప్పారు. కర్ణాటకలో రైతుబంధు, బీమా, రుణమాఫీ లేవని, మరి ఏ మొహంతో తెలంగాణలో ప్రచారం చేస్తున్నారని? నిలదీశారు. తెలంగాణలోని ప్రతి పల్లె అద్భుతంగా తయారైందని గుర్తుచేశారు. మరి కర్ణాటక పల్లెల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సొంత ఇంటిని బాగు చేసుకోలేని డీకే.. తెలంగాణపై బుదరజల్లే ప్రయత్నం మానుకోవాలని హితవుపలికారు. సొంత పార్టీ నాయకులకే టికెట్లు అమ్ముకునే నాయకుడు.. రాష్ట్రాన్ని ఏ రకంగా అమ్ముకొని తింటాడో ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌లో కుర్చీ లొల్లి

- అధిష్ఠానంతో రేవంత్ మైండ్ గేమ్
- ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రచారం
- సహకారం అందిస్తున్న డీకే శివ
- సీనియర్ నాయకుల కుతకుత
- తానూ సీఎం రేసులో ఉన్నానంటూ కోమటిరెడ్డి సూచనలు
- తనను వరిస్తుందన్న జానారెడ్డి
- తానూ సీఎం అవుతానన్న జగ్గారెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో 'ముఖ్యమంత్రి' పదవి రచ్చ మొదలైంది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ పెట్టిన మంటతో పార్టీలోని సీనియర్లంతా కుత కుతలాడుతున్నారు. శనివారం తాండూరులో జరిగిన ప్రచార సభలో రేవంత్‌ను సీఎం అభ్యర్థిగా సంబోధించటంపై సీనియర్లు మండిపడుతున్నారు. కర్ణాటక కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ తన ప్రసంగంలో రేవంత్‌రెడ్డి పేరు ఎత్తకున్నా.. ఆయన మాటల తెలుగు అనువాదంలో మాత్రం 'రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణం చేయబోతున్నారు' అని చెప్పిన సంగతి తెలిసిందే. ఇది రేవంత్‌రెడ్డి కావాలనే చెప్పించుకున్నాడని సీనియర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలో సోషల్ మీడియాలో, తన ఎన్నికల ప్రచార సభల్లో, సమావేశాల్లో 'సీఎం.. సీఎం' అని చెప్పించుకుంటూ మైండ్ గేమ్ ఆడుతున్నారని మండిపడుతున్నారు. ఈ ప్రచారంపై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం గట్టి కౌంటర్ ఇచ్చారు. 'కాంగ్రెస్‌లో ప్రతి ఎమ్మెల్యే ముఖ్యమంత్రి అభ్యర్థే' అని స్పష్టం చేశారు. సీఎం రేసులో తాను కూడా ఉన్నానని చెప్పకనే చెప్పారు. సీనియర్ నేత జానారెడ్డి కూడా ఇటీవల 'సీఎం కుర్చీయే నన్ను వరిస్తుంది' అని ప్రకటించిన విషయం తెలిసిందే. మరికొంత మంది సీనియర్లు ఒకటి రెండు రోజుల్లో బయటికి వచ్చి తామే సీఎం అని చెప్తారని విశ్లేషకులు అంటున్నారు.

రేవంత్ గుప్పిట్లోకి కాంగ్రెస్

తాము దశాబ్దాలుగా జెండా మోసి, త్యాగాలు చేసి బతికించుకుంటున్న కాంగ్రెస్.. ఇప్పుడు పూర్తిగా రేవంత్‌రెడ్డి గుప్పిట్లోకి వెళ్లిపోయిందని నేతలు, శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఐదేండ్ల కిందట వచ్చిన తన మైండ్‌గేమ్‌తో పార్టీని ఆక్రమించారని మండిపడుతున్నారు. 'సాధారణ నేతగా కాంగ్రెస్‌లో చేరాడు. కొడంగల్‌లో పోటీ చేసి ఓడిపోయాడు. తర్వాత మల్కాజిగిరి ఎంపీ స్థానానికి టికెట్ తెచ్చుకున్నాడు. గెలిచిన తర్వాత తన పథకాన్ని అమలు చేయడం మొదలు పెట్టాడు. ఢిల్లీ పెద్దలతో మైండ్‌గేమ్ ఆడుతున్నాడు' అని ఓ సీనియర్ నేత ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్లపై దుష్ప్రచారం మొదలు పెట్టి, పార్టీ దుస్థితికి వారే కారణమంటూ ప్రజల, అధిష్ఠానం ముందు దోషులుగా నిలబెట్టాడని వాపోతున్నారు.

సీనియర్ల నోటికి తాళం..

రేవంత్ బాధ్యతలు చేపట్టిన తర్వాత సీనియర్లకు వ్యతిరేకంగా పార్టీలో క్యాంపెయినింగ్ చేయించాడని ఓ సీనియర్ నాయకుడు తెలిపారు. రాహుల్‌గాంధీ రాజీనామా, సోనియాగాంధీ అనారోగ్యం తదితర కారణాలతో కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ఆందోళనలో ఉండటంతో త